## క్లుప్తంగా

### దైవభక్తిని అలవర్చుకోవాలి

మరికల్: మండలంలోని జిన్నారంలో గ్రామస్తులు సోమవారం గుడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామి ఆలయంలో గుడిబాట పోస్టర్‌ను విడుదల చేశారు. ఆలయ పూజారి శంకర్ మాట్లాడుతూ ప్రజలు దైవ భక్తిని అలవర్చుకోవాలని మన సంప్రదాయలను, సంస్కృతిని తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కోస్గి రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి, అధ్యాపకులతో కలిసి సోమవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చేర్పించి రూ.లక్షల్లో వృథా చేసుకోకుండా ప్రభుత్వ కళాశాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జోరుగా మొరం తరలింపు



మాగనూర్: మండల పరిధిలో జోరుగా కొనసాగుతున్న మొరం తరలింపును అధికారులు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక నల్లగట్టు సమీపంలోని కృష్ణ మండలం పరిధిలో మొరం తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా ఇట్టు మండలం మీదుగా మొరం తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొరంతో అతి వేగంగా టిప్పర్లు వెళ్తుండటంతో ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే ఎలా అని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా తరలుతున్న మొరం టిప్పర్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

### ప్రభుత్వ నిర్ణయం సరికాదు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులకు పర్యవేక్షణ విధులను అప్పగించడం సరైన నిర్ణయం కాదని, ప్రభుత్వం వెంటనే దీనిపై పునరాలోచించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి, సూర్యచంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి తనిఖీల కోసం నియమిస్తామనడం సమంజసం కాదని, జీహెచ్‌ఎంలపై కింది స్థాయి టీచర్లు పర్యవేక్షణ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు, విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించి పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు.

### అమరచింతలో ఫుడ్ ఫెస్టివల్

అమరచింత: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో పాటు మహిళా సంఘం ద్వారా రుణాలు తీసుకుని చిరువ్యాపారాలు చేస్తున్న మహిళలు వివిధ రకాలు వంటకాలను ప్రదర్శించారు. వంటకాల రుచులను పరిశీలించిన అధికారులు బహుమతులు అందించారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ సమాఖ్య చేస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, మున్సిపల్ మేనేజర్ యూసుఫ్, ఆర్పీలు పాల్గొన్నారు.

### 29న సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ

అమరచింత/ఆత్మకూర్: అమరచింత పట్టణంలో ఏర్పాటు చేసిన సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణకు ఈనెల 29న మాజీ మంత్రులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు వస్తున్నారని గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్ తెలిపారు. ఈ మేరకు సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ సాయిచంద్ అమరచింతలో పుట్టి తన గానంతో యావత్తు తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడని, దేశ, విదేశాల్లో పాలమూరు ప్రజల వాణి వినిపించిన వ్యక్తిగా చరిత్రలో మిగిలి పోయాడని గుర్తు చేసుకున్నారు.

# బస్సులు రాక.. తప్పని కాలినడక



పెద్దపొర్ల స్టేజ్ వరకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



పెద్దపొర్ల స్టేజ్ నుంచి గ్రామానికి కాలినడకన వస్తున్న వృద్ధులు

- పల్లెల్లో కానరాని పల్లెవెలుగు బస్సులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని స్థానికుల ఆవేదన
- పట్టించుకోని ఆర్‌టీసీ అధికారులు

ఊట్కూర్: మండలంలోని అనేక గ్రామాలకు నేటికీ సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం గ్రామ గ్రామానికి బీటీ రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నా ఆర్‌టీసీ అధికారులు మాత్రం బస్సు సౌకర్యం కల్పించడంపై దృష్టి పెట్టడం లేదు. దీంతో ఉన్నత చదువుల కోసం పట్టణాలకో, మండల కేంద్రానికో వెళ్తున్న విద్యార్థులు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మండలంలోని సమస్తాపూర్, పెద్దపొర్ల, మల్లెపల్లి, కొల్లూర్, చిన్నపొర్ల, లక్ష్మీపల్లి తదితర గ్రామాలకు ప్రభుత్వం బీటీ రోడ్లు వేసింది. రోడ్లు వేసిన ఈ గ్రామాలకు ఇప్పటికీ ఆర్‌టీసీ అధికారులు బస్సులు నడవకపోవడంతో విద్యార్థులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లొచ్చేందుకు ప్రైవేట్



నారాయణపేట డిపో మేనేజర్ లావణ్యకు వినతిపత్రం అందిస్తున్న నేత (ఫైల్)

వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పెద్దపొర్ల, చిన్నపొర్ల, కొల్లూర్ తదితర గ్రామాల విద్యార్థులు చదువుకోవడానికి నారాయణపేట, మక్తల్‌లో ఉన్న కళాశాలలకు వెళ్తుండడంతో గ్రామంలోని నుంచి స్టేజ్ వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర కాలినడకన రావాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపొర్ల, కొల్లూర్ గ్రామాల నుంచి స్టేజ్‌ల వరకు దాదాపు 5కి.మీ ఉంటుంది. అయితే ఇక్కడి వరకు బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు రోజూ బస్సుల కోసం స్టేజ్‌ల వరకు నడవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

**నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే**

పెద్దపొర్ల, చిన్నపొర్ల గ్రామాల నుంచి స్టేజ్ వరకు 4 కి.మీ బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. ఈ గ్రామాల నుంచి సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు నారాయణపేట, మక్తల్‌కు వెళ్తుంటారు. గతంలో ఈ గ్రామాల నుంచి స్టేజ్‌ల వరకు బస్సులు నడిచేవి. అయితే రోడ్డు సౌకర్యం సరిగా లేదనే కారణంతో బస్సులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ప్రజలు కాలినడకన వెళ్తూ అవస్థలు పడుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

నారాయణపేట డిపోలో బస్సుల కొరత ఉంది. కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. కొత్త బస్సులు వచ్చిన వెంటనే ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తీరుస్తాం.

–లావణ్య, డిపో మేనేజర్, నారాయణపేట

**మంత్రి స్పందించి సమస్య తీర్చాలి**



మాది ఊట్కూరు మండలం పెద్దపొర్ల గ్రామం. నేను మక్తల్‌లో ఇంటర్ చదువుతున్నాను. గ్రామం నుంచి స్టేజ్ వరకు 4 కి.మీ. దూరం ఉంది. అయితే ఇక్కడి వరకు బస్సు సౌకర్యం లేదు. దీంతో రోజు స్నేహితులతో కలిసి కాలినడకన కళాశాలకు వెళ్లి వస్తున్నా. రోజూ నడుచుకుంటూ వెళ్లా రావాలంటే కష్టంగా ఉంది. మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి బస్సు సౌకర్యం కల్పించి మా ఊరి వరకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– రామలింగమ్మ, విద్యార్థిని

**బస్సు సౌకర్యం కల్పించాలి**



కొల్లూర్ గ్రామానికి గతంలో బస్సు వచ్చేది. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు 3 కి.మీ. స్టేజ్‌ల వరకు నడవాల్సి వస్తుంది. బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆర్‌టీసీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– మహ్మద్ హుసేన్ పాషా, కొల్లూర్

### బస్ పాస్ చార్జీలు తగ్గించాలి



నారాయణపేట రూరల్: బస్ పాస్ ధరలను పెంచి బీద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందులు కలిగించడం సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు నరహరి అన్నారు. బబస్సు చార్జీలు తగ్గించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్సు పాస్ ధరలను పెంచడం వల్ల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే పెంచిన బస్సు పాస్ ధరలను తగ్గించి విద్యార్థులకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న ఉచిత బస్ పాసును 35 కిలోమీటర్లకు పెంచాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

### 'మధ్యాహ్న భోజనం' బిల్లులు చెల్లించాలి

ధన్వాడ: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం పథకం బిల్లులను వెంటనే చెల్లించాలని సోమవారం భోజన నిర్వాహకులు లక్ష్మీరేఖ, బీమమ్మ, అనంతమ్మలు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. 18 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించాలని అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని, వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయమ్మ, తస్లీమ్ పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మద్దూరు: సిగరెట్, మద్యం తాగడం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యసనాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత ఇప్పుడు మత్తు కోసం ఏకంగా గంజాయి, మాదక ద్రవ్యాల బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా వ్యసనాలకు బానిసైతే టోల్ ఫ్రీ నెంబర్ 1908, లేదా డయల్ 100 ఫోన్ చేయాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు**

మాగనూర్: మత్తుకు బానిసై బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ అశోక్‌బాబు యువతకు సూచించారు. సోమవారం కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం, దేశంపైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు.



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

**మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు**

నర్వ: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలై బంగారం లాంటి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని నర్వ ఎస్‌ఐ పబ్బతి రమేష్ అన్నారు. సోమవారం కల్వాల్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకోవద్దని, వీటి వల్ల జీవితాలు అంధకారం అవుతాయని సూచించారు.

నారాయణపేట క్రైమ్: యువకులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మాగనూర్: ఉపాధ్యాయులు చదువులో వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నేరడగం కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు రాజేష్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొత్తపల్లి యూపీఎస్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి శుచి, శుభ్రత పాటించి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వంట కార్మికులను ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థుల చేత రోజూ వర్క్‌బుక్‌ను చేయించాలని, వర్క్ బుక్‌లను కరెక్షన్ చేయాలని సూచించారు. ఆరు, ఏడు తరగతులను బోధించే ఉపాధ్యాయులు ప్రతిరోజు టీచర్ డైరీ మెయింటెన్ చేసి హెడ్మాస్టర్‌తో అప్రూవల్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాఠాలు సరళంగా బోధించాలి**

దామరగిద్ద: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో రాయడం చదవడం, తదితర చతుర్విధ ప్రక్రియలను విధిగా నేర్పించాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మల్‌రెడ్డిపల్లి గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులలో మాట్లాడి వారి కనీస సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

ఊట్కూర్: మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి ఉమాపతి ఆదేశించారు. సోమవారం మండలంలోని పులిమామిడి కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను, పరిసరాలను, వంటగదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాజేష్ కుమార్

**విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి**

నర్వ: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు కావొస్తున్నందున విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం నర్వ ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లను తనిఖీ చేసి, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు రాజు, నాగలక్ష్మి, సీఆర్పీ నర్సింములు తదితరులున్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం పట్టణంలోని 4వ వార్డులో ప్రజలకు తడి–పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

### మాగనూర్ ఎంపీడీఓగా శ్రీనివాసులు



మాగనూర్: మాగనూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీఓ) శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమర మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల ఎంపీడీఓగా పనిచేస్తూ మాగనూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్య క్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు.

### మొక్కలు సిద్ధంగా ఉంచాలి

మాగనూర్: వనమహోత్సవంలో భాగంగా మండల వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీవో మన్యం వనసేవకులకు సూచించారు. సోమవారం ఆయన మందిపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో నాటేందుకు అధిక సంఖ్యలో మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, వన సేవకులు తదితరులు పాల్గొన్నారు.

### టీయూసీఐ స్టేట్ జాయింట్ సెక్రటరీగా అరుణ్‌కుమార్



నర్వ: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ టీయూసీఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఆయన తెలిపారు. జూన్ 21న నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర ప్రథమ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. ఈ ఎన్నికలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా సూర్యం, ఎస్‌ఎల్ పద్మలతో పాటు జాయింట్ సెక్రటరీగా తనను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానన్నారు.

### అథ్లెటిక్ పోటీల నిర్వహణ

నారాయణపేట టౌన్: క్రీడలు విద్యార్థులలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీగ్రౌండ్‌లో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒలంపిక్స్ డే సందర్భంగా విద్యార్థులకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కానిస్టేబుల్ ప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించి భవిష్యత్‌లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్ హారిక దేవి, క్రికెట్ కోచ్ అజయ్, రవి, అనిల్ కుమార్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

### పీయూలో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లిం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పి ంచాలని కోరుతూ మైనార్టీ ఉద్యోగ సంఘం ప్ర తినిధులు మహ్మద్ అయాజ్, అబ్దుల్ ఖాదర్, సిరాజ్‌ఖాన్, జైనుల్‌ఆబెదిన్ తదితరులు సో మవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ సల హాదారులు మహ్మద్ అలీ షబ్బీర్‌కు వినతిప త్రం అందజేశారు. పాలమూరు యూనివర్సిటీ లో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలని, ము స్లింల అభ్యున్నతికి ప్రత్యేక సబ్ ప్లాన్ అమలు చేయాలని షబ్బీర్ అలీకి విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

నారాయణపేట: పట్టణం నుంచి యాదగిరి రోడ్డుకు వెళ్లే రహదారి పక్కన సర్వే నెంబర్–139లో గల నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని బలరామ్ కిసాన్ సంఘ్, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో పాటు నారాయణపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని కొందరు యథేచ్ఛగా కబ్జా చేసి దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బలరామ్ కిసాన్ సంఘ్, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు వెంకట్‌రెడ్డి, విజయ్‌గౌడ్‌లు ఉన్నారు.



కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మరికల్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నాయకుల నివాళి



మద్దూరులో శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మరికల్: జనసంఘ్ పార్టీ అధినేత డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అమ్మపేరుతో సంతబజార్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, మండల అధ్యక్షుడు వేణుగోపాల్, సురేందర్‌గౌడ్, రమేష్, ప్రతాప్‌రెడ్డి, శెట్టి మహేష్, శ్రీరామ్, రవి, నిఖిల్, చెన్నయ్య, మోహన్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, అశోక్, శివ, పరుశురామ్‌లు పాల్గొన్నారు.

మక్తల్: శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ కార్యక్రమం సందర్భంగా సోమవారం మక్తల్ మండలం గొల్లపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాలు ఉండకూడదని పోరాటం చేసిన వ్యక్తి ముఖర్జీ అని బీజేపీ నేతలు ఆయన సేవలను కొనియాడారు.

మద్దూరు: శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయసాధనకు బీజేపీ కార్యకర్తలందరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో, సాయిలు, భరత్, కాశీనాథ్, రాఘవేందర్, మాధవ్, ఉమేష్, చంద్రమౌళి, శ్రీధర్, ప్రశాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. సమైఖ్య భారతవని కోసం ప్రాణాలర్పించిన నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని ఆయన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

## పెన్షనర్ల బిల్లును ఉపసంహరించుకోవాలి

నారాయణపేట రూరల్: లోక్‌సభలో ప్రవేశపెట్టిన పెన్షనర్లకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఫైనాన్స్ బిల్లులో వేతన సవరణ సంఘం చేసిన సిఫారసులు పాత పెన్షనర్లకే వర్తించే విధంగా ఉన్నాయని, జనవరి 2026 తర్వాత రిటైర్డ్ అయిన వారిని వేరు చేస్తున్నారని ఆరోపించారు. అనేక మంది పెన్షనర్లు వృద్ధాప్యంలో ఒక పక్క ఇబ్బందులు పడుతుండగా, మరో పక్క అనారోగ్య సమస్యలతో సతమమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బీజేపీ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మనోహర్, వకీల్ సంతోష్ కుమార్, గోపాల్, భాస్కర్, సత్యనారాయణ, ఎంఎస్ కుమార్, జయతీర్థ, కృష్ణయ్య, గంగాధర్, రాములు, గోపాలం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

## వర్షం కోసం గ్రామ దేవతకు పూజలు

కృష్ణా: వర్షం కురిపించాలంటూ కున్సీ గ్రామంలోని మహిళలు గ్రామ దేవతను వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెలలో ముందస్తు వర్షాలు కురవడంతో మండలంలోని 90 శాతం మంది రైతులు ముందస్తుగా పంటల సాగు చేపట్టారు. అయితే 15 రోజుల నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మండల వ్యాప్తంగా సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు వర్షాలు కురవాలని కోరుకుంటూ గ్రామ దేవతకు నీళ్లుపోసి వేడుకున్నారు. నాలుగు రోజుల్లో వర్షాలు రాకపోతే ఇక పంటలు చేతికందవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కున్సీలోని గ్రామ దేవతకు నీళ్లు పోసి వర్షం కురవాలని వేడుకుంటున్న మహిళలు